www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 డిసెంబర్ 2025
5
వైఎస్ఆర్



వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని జెఎంజె సర్కిల్‌లో వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి పాల్గొని భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహ నిర్మాణం ద్వారా వడ్డే ఓబన్న సేవలు, వారి త్యాగాలు భావి తరాలకు స్ఫూర్తిగా నిలవాలని పేర్కొన్నారు. సమాజానికి ఆదర్శంగా నిలిచిన నాయకుల స్మరణకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఓర్సు బాల్కొండయ్య, రమణయ్య, జిల్లా అధ్యక్షులు చంద్రగిరి నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాయచోటి వెంకటసుబ్బయ్య, రమణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి, యూత్ ప్రెసిడెంట్ నంద్యాల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బత్తుల శివ, నగర యూత్ అధ్యక్షులు తిరుమల శివ శంకర్, ప్రధాన కార్యదర్శి కొంచెం వెంకట కళ్యాణ్, జిల్లా ఉపాధ్యక్షులు జరిపిటి సుధాకర్, మంజుల, కులాయప్ప, పి.బాల పెద్దయ్య, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి చీకటి రోజు

- 'జీ రామ్‌జీ' బిల్లును ఆమోదించడం దుర్మార్గం
- సిపిఎం జిల్లా, నగర కార్యదర్శులు చంద్రశేఖర్, రామమోహన్
గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పణ



నిరసన తెలియజేస్తున్న సిపిఎం, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దు చేస్తూ ఉపాధిని హరించే 'జీ రామ్‌జీ' అనే నూతన బిల్లును లోక్‌సభలో బలవంతంగా ఆమోదింపజేసిందని సిపిఎం కడప జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామమోహన్ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం ఐటిఐ సర్కిల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గాంధీ వినతిపత్రం సమర్పించారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులు, కూలీలకు చేసిన ఘోర నమ్మకద్రోహమని, ఇది దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజని తెలిపారు. ఎంఎన్ఆర్ఇజిఎ ఎవరి దయ మీద వచ్చిన పథకం కాదని, అది ప్రజల పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టబద్ధమైన ఉపాధి హక్కని చెప్పారు. పని అడిగితే పని ఇవ్వాల్సిందే అనే బాధ్యతను ప్రభుత్వంపై మోపిన చట్టమని, అలాంటి హక్కు ఆధారిత చట్టాన్ని రద్దు చేసి, ఉపాధిని కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా ఇవ్వబడే భిక్షగా మార్చడం ఈ బిల్లులోని అసలు ఉద్దేశమన్నారు. ఈ బిల్లును పార్లమెంటులో చర్చ లేకుండా, ప్రజాస్వామ్య సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ ఆమోదించడం, ప్రతిపక్షాలకు మాట్లాడే సమయం ఇవ్వక పోవడం, సెలక్ట్ కమిటీకి పంపాలన్న డిమాండ్‌ను తిరస్కరించడం పూర్తిగా నియంతృత్వ పద్ధతిలో చట్ట నిర్మాణం చేసినట్లైనన్నారు. రెండు రోజులలోనే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పని పొందే హక్కు ఉన్న చట్టాన్ని బుల్డోజర్‌లా కూల్చివేశారని, పేదల ఉపాధిపై, జీవనంపై ప్రభుత్వం బుల్డోజర్ మోడల్‌ను అమలు చేసిందన్నారు. మహాత్మా గాంధీని చంపిన గాడ్సే వారసులే ఈ రోజు గాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కూడా చంపారని, ఉపాధి హామీని మతతత్వ రంగును పులమటానికి జి రామ్ జి వచ్చే విధంగా బిల్లును తీసుకొచ్చారన్నారు. గాంధీ పేరును, ఆయన మత సామరస్య ఆలోచనలను తుడిపేసి హిందుత్వానికి అనుగుణంగా 'జీ రామ్ జీ' పేరుతో తెచ్చిన కొత్త చట్టం ద్వారా ఉపాధి హామీని హక్కు నుంచి తీసేసి కేంద్ర ప్రభుత్వ దయపై ఆధారపడే పథకంగా దిగజార్చారని వాపోయారు. ఉపాధి హక్కు రక్షణ అనేది కేవలం సంఘాల లేదా పార్టీల సమస్య కాదని, రాజకీయ భేదాలు పక్కనపెట్టి అందరూ ఐక్యంగా ఈ పోరాటంలో నిలవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అన్వేష్, దస్తగిరిరెడ్డి, కామనూరు శ్రీనివాసులరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రరెడ్డి, జమీల, వెంకటేశ్వర్లు, నాయకులు రామ కృష్ణారెడ్డి, నరసింహ, నారాయణరెడ్డి, శంషాద్, విజయ్, తిమ్మయ్య, ప్రవీణ్ కుమార్, రఘు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** ఉపాధి చట్టానికి జిరామ్‌జి అనే పేరు మార్చడం అన్యాయమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. బైరవప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సిపి ఎం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీకి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ పేరుతో ఉన్నటువంటి ఉపాధి చట్టాన్ని ఉపాధి హామీ పేరును జి రామ్ అనే పేరుతో పార్లమెంటులో ఆమోదించడంపై దుర్మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామయ్య కృష్ణయ్య, రామకృష్ణ, మాధవిలత, దుర్గాప్రసాద్, సిద్దయ్య, ప్రవీణ్, కవిత, బాలుడు, ప్రదీప్, స్వాతి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్మికులను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కొంతమంది ఇంజినీరింగ్ కార్మికులపై దారుణంగా దూషించిన ఎంఇ అన్నా రెడ్డి విజయ్ కుమార్‌రెడ్డిపై విచారించి తక్షణమే సస్పెండ్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మున్సిపల్ కార్మికులు అనేక రకాల కష్టాలు, బాధలు పడి పనిచేస్తున్నారని గుర్తు చేశారు. పనికి తగిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి తరుణంలో కార్మికులు ఏదన్నా పొరపాటు చేస్తే పిలిచి మందలించాల్సినటువంటి అవసరం అధికారుల పైన ఉందని తెలిపారు. అలా కాకుండా కడప కార్పొరేషన్‌లో ఎంఇగా పని చేస్తున్న అన్నారెడ్డి విజయ్ కుమార్‌రెడ్డి కార్మికులను దుర్మార్గంగా దూషించడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అందరి సమక్షంలో దూషించడం ఒక ఎంఇ స్థాయికి తగదని తెలిపారు. నిస్వార్థంగా పనిచేస్తున్న కొంతమంది వర్కర్లను దూషించడానికి ఎవరు హక్కు ఇచ్చారని పేర్కొన్నారు. ఉద్యోగులు చిన్న స్థాయి ఉద్యోగులను గౌరవించాల్సినటువంటి అవసరం ఉందని తెలిపారు. ఈ సంఘటనపై జిల్లా ఉన్నత అధికారులు విచారించి కఠినంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జరిగిన సంఘటన పైన కలెక్టర్, మేయర్, కమిషనర్ కలుస్తామని తెలిపారు. ఇలానే కొనసాగితే జిల్లా వ్యాప్తంగా ఆందోళ నిర్వహిస్తామని పేర్కొన్నారు.



సిఐతో చర్చిస్తున్న టిటిడి అధికారులు

వివాదాస్పదంగా నిత్యాన్నదానం షెడ్ ఏర్పాటు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

స్థానిక కోదండ రామాలయం దగ్గర తాత్కాలికంగా నిర్మిస్తున్న నిత్య అన్నదానం కుషెడ్డుకు అంతరాయం ఏర్పడింది. షెడ్ ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. ఒంటిమిట్ట నివాసంలో ఉంటున్న పామూరు సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి టిటిడి తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న నిత్య అన్నదానం షెడ్డు వద్ద తమకు భూమి ఉందని, పరిహారం ఇచ్చేంత వరకు షెడ్ నిర్మించరాదని గత వారంలోనే సిమెంట్ పోల్ నాటారు. భూమికి సంబంధించిన రికార్డులు, పత్రాలు ఉంటే ఇవ్వాలని టిటిడి అధికారులు తహశీల్దార్‌ను అడగ్గా తమ వద్ద ఎలాంటి రికార్డులు లేవని సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం టిటిడి డిప్యూటీ ఇఒ ప్రశాంతి, విజిలెన్స్ డిఎస్‌పి గిరిధర్ కలిసి సుబ్రమణ్యం నాటిన సిమెంట్ పోల్‌ను తొలగించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ సుబ్రమణ్యం అనే వ్యక్తికి లీగల్‌గా కోర్టుకు వెళ్లి హక్కు పత్రాలు తీసుకొస్తే పరిహారం చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో టిటిడి అసిస్టెంట్ ఇంజనీర్ అమర్‌నాథరెడ్డి, సెక్యూరిటీ, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

డిపిఒ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైఎస్ఆర్ కడప జిల్లా పైన అనుచిత వ్యాఖ్యలు చేసి జిల్లా ఖ్యాతిని,గౌరవాన్ని, మంటగలిపినడిపిఒ రాజ్యలక్ష్మి కడప జిల్లా ప్రజలకు, సర్పంచులకు క్షమాపణ చెప్పాలని వైసిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల అమరావతిలో జరిగిన రాష్ట్ర పంచాయతీరాజ్ అధికారుల సమీక్ష సమావేశంలో కళా రంగానికి చెందిన సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రితోనే డిపిఒ కడప జిల్లాపై వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసి కడప జిల్లాపై విషం చిమ్మారని పేర్కొన్నారు. కడప అంటే బాంబులు వేస్తారని, కడప అంటే యుద్ధం చేయాలని ఆమె చెప్పారని తెలిపారు. కవులకు, కళాకారులకు, మంచితనానికి, నిబద్ధతకు నిక్కచ్చితనానికి మర్యాదకు పుట్టినిల్లైన కడప జిల్లాను ఫ్యాక్షన్ జిల్లాగా ఇప్పటికే సినీరంగం ముద్ర వేసిందని, దీన్ని కొన సాగిస్తూ ఆమె కడప జిల్లాను బాంబుల గడ్డగా పేర్కొనడం దారుణమన్నారు.



ప్రజా సమస్యలు వింటున్న రితీష్‌కుమార్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి- కాశినాయన

గ్రామాల్లో ఉండే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బద్వేల్ టిడిపి ఇన్‌ఛార్జ్ రితీష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు మండల కేంద్రమైన నరసాపురంలోని కల్యాణ మండపంలో బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి బద్వేల్ టిడిపి ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒక్కొక్క గ్రామ పంచాయతీ నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అధికంగా భూసమస్యలు రావడంతో తహశీల్దార్‌ను పిలిచి ఎందుకొస్తున్నాయని ప్రశ్నించారు. అనంతరం రితేష్‌రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి అర్జీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రతి పేదవాడికి కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని చెప్పారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే మండలానికి వచ్చానని పేర్కొన్నారు. అధికారులు కూడా ప్రజలు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని వారని ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. పేదవాడు పెట్టే ప్రతి అర్జీ పరిష్కారం అయ్యే విధంగా ఉంటుందని మీరు ఎక్కడ కూడా ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పంగా రవీంద్రారెడ్డి కృష్ణారెడ్డి, పోల్ రెడ్డి కొండ నరసింహారెడ్డి, ఈశ్వర్, రెడ్డి కృష్ణయ్య, నరసాపురం సర్పంచ్ ఖాజావలి. ఆయకట్టు ప్రెసిడెంట్ సంజీవ రాయుడు, సొసైటీ చైర్మన్ గురువిరెడ్డి, రాజారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తిరివీధి హుసేనమ్మ, టిడిపి నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** పట్టణంలోని సొసైటీ సభాభవనంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు ముఖ్యఅతిథిగా హాజరై మండలంలోని ఆయా గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భైరవ ప్రసాద్, సింగిల్ విండో ప్రెసిడెంట్ కల్లూరు కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తుపాకుల ప్రసాద్, ఇతర టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే ప్రజా దర్బార్ నిర్వహణా లక్ష్యమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. వీటన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ ప్రొద్దుటూరు పట్టణాధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎఆర్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే సిబ్బంది అకాలమరణం పొందడం బాధాకరమన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఆర్ఐ శివరాముడు, బి.మహేశ్వర్ రెడ్డి స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి పుష్ప గుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం పోలీస్ లాంఛనాలతో మహేశ్వర్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆర్‌టిసిలోని క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ 2026వ డైరీని ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యులు మాధవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐటిడిపి కడప అధ్యక్షులు బొమ్మిశెట్టి చంద్రశేఖర్, 24వ డివిజన్ ఇన్‌ఛార్జి అశోక్ రెడ్డి, నేషనల్ మజ్దూర్ యూనియన్ కడప డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు, నాగరాజు, జయంత్ పాల్గొన్నారు.

సీమ అస్తిత్వానికి చిరునామా గజ్జెల మల్లారెడ్డి

శత జయంతి సదస్సులో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి



గజ్జెల మల్లారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నచంద్రశేఖర్‌రెడ్డి, విసి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాయలసీమ అస్తిత్వాన్ని చిరునామాగా చేసుకుని తెలుగు గేయానికి గజ్జకట్టి నృత్యం చేయించిన అభ్యుదయ రచయిత గజ్జెల మల్లారెడ్డి అని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వ విద్యాలయం తెలుగు శాఖ, కేంద్ర సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గజ్జెల మల్లారెడ్డి శత జయంతి సదస్సు విశ్వవిద్యాలయంలోని మొల్ల సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ప్రారంభోపన్యాసం చేసిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతుఊ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారత ప్రభుత్వం భాషల పట్ల వారధిగా పనిచేయడానికి కేంద్ర సాహిత్య అకాడమీని ఏర్పాటు చేశారన్నారు. గజ్జెల మల్లారెడ్డి రాయలసీమ అస్తిత్వాన్ని చిరునామాగా చేసుకున్నాని, తెలుగు గేయానికి గజ్జకట్టి న్ృత్యం చేయించారని చెప్పారు. అభ్యుదయ సాహిత్యానికి కడప జిల్లా కవులు ప్రధాన భూమిక పోషించారని, వారిలో రాచమల్లు రామచంద్రా రెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి, సొదుంజయరాం, గజ్జెల మల్లారెడ్డి ఉన్నారన్నారు. మల్లారెడ్డి వేమన లాగే ప్రజల్లో తిరిగారని, అందుకే ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు కవిత్వంగా మార్చారని చెప్పారు. ముఖ్య అతిథిగా హాజరైన వైవీయూ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో నిర్వహించే కార్యక్రమాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చర్చకు రావాలని, గజ్జెల మల్లారెడ్డి సరళమైన భాషలో, క్లుప్తంగా, వ్యంగ్యాత్మంగా రాస్తారని, రాజకీయ విమర్శ చాలా సూటిగా ఉంటుందని ఉదహరించారు. విద్యార్థులు తాము చదువుతున్న కోర్సులకు అతీతంగా విభిన్న విషయాల్లో అవగాహన సాధించినప్పుడే సంపూర్ణ జ్ఞాన వంతులు అవుతారని తెలిపారు. సదస్సు ప్రారంభం సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు వృత్తి బాధ్యతతో పాటు ఒక ప్రవృత్తిని ఎంచుకుని ముందుకు సాగితే భవిష్యత్తు సంతోషంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి రాసిన 'గజ్జెల మల్లారెడ్డి జీవిత చరిత్ర' పుస్తకం(మోనోగ్రాఫ్)ను అతిథులు ఆవిష్కరించారు. సదస్సులో కేంద్ర అకాడమీ ప్రతినిధి టి.ఎస్. చంద్రశేఖర రాజు, సాహిత్య తెలుగు శాఖ ఆచార్యులు పి.రమాదేవి, జి. పార్వతి, ఆర్ట్స్ డీన్ ఆచార్య కె. గంగయ్య, పరిశోధకులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న మేయర్ పాకా సురేష్

మురుగు నీటిని తొలగించాలి : మేయర్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో మురుగునీరు నిలువ లేకుండా ఎప్పటికప్పుడూ తొలగించాలని మేయర్ పాకా సురేష్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మేయర్ మార్నింగ్ విజిట్‌లో భాగంగా 49వ డివిజన్‌లోని అలంఖాన్‌పల్లెలో ఉన్న హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి పరిశీలించారు. 49వ డివిజన్ ఇన్‌ఛార్జి మధువర్ధన్‌రెడ్డి, స్థానిక నాయకులు శ్రీను, దస్తగిరి, దాసు, సుభాన్ శ్మశాన వాటిక, డివిజన్‌లో ఉన్న డ్రెయినేజీ సమస్యలను మేయర్ దృష్టి కి తీసుకువచ్చారు. శ్మశానం చుట్టూ చాలా రోజులుగా నీరు నిలబడడం వలల దస్తగిరి పేట, దళితవాడ ప్రజలు, కమ్యూనిస్ట్ నాయకుల నుంచి చాలా ఫిర్యాదులు వచ్చాయని మేయర్ తెలిపారు. అందరికి మురుగునీటి సమస్యే ప్రధానమని చెప్పారు. కొన్ని రోజులుగా సమస్య అలాగే ఉందని గుర్తించినట్లు పేర్కొన్నారు. బేలింగ్ వాటర్ చేయాలంటే ప్రజలు సహకరించాలని కోరారు. తాత్కాలికంగా వీధులలోనీ డ్రెయినేజీ నీటిని జెసిబి గలార్ మిషన్‌ల ద్వారా తొలగిస్తున్నారని తెలిపారు. గతంలో కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల నుంచి అలంఖాన్ పల్లె, దస్తగిరి పేట దళితవాడ ప్రాంతాల మురుగు నీటిని ఆలంఖాన్ పల్లె హైవే ద్వారా శ్మశాన వాటిక, దండు ప్రాంతాల పై నుంచి బుగ్గ వంక లోకి వెళ్ళేటట్లు రూ. 1.30 కోట్లతో టెండర్ ు పిలిచారని పేర్కొన్నారు. డిఇ సుధాకర్ నాయక్, ఎఇ శ్రీనివాసులు రెడ్డి, అమెంటీస్ సెక్రెటరీలకు ఆ టెండర్ ప్రాసెస్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటనలో వైసిపి కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జులు బాలస్వామి రెడ్డి, శ్రీ రంజన్ రెడ్డి, సుబ్బరాయుడు, నాయకులు రెడ్డయ్య, శ్రీ రాములు, జిలాన్, స్థానిక నాయకులు హేమనాథ్, సుబ్బరాయుడు, రామ చంద్ర రెడ్డి, కమ్యూనిస్టు నాయకులు నాగరాజు, నరసింహులు, స్థానికులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడతున్న డిఇఒ షంషుద్దీన్

యాక్షన్ ప్లాన్ తప్పనిసరిగా పాటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని ప్రతి పాఠశాలలోనూ వందరోజుల పదవ తరగతి యాక్షన్ ప్లాన్ తప్పనిసరిగా పాటించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్. శంషుద్దీన్ ఆదేశించారు. శుక్రవారం నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన పదవ తరగతి ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసుకుని యాక్షన్ ప్లాన్ తప్పనిసరిగా అమలు చేయాలని పేర్కొన్నారు. విద్యాశాఖ సూచనల మేరకు పరీక్షలు నిర్వహించి లీప్ యాప్‌లో మార్కులు నమోదు చేయాలని ఆదేశించారు. రోజూ ఉదయం ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని, పాఠశాలలో లాంగ్ అబ్సెంటీస్ విద్యార్థులను పాఠశాలలకు వచ్చేలా చేసి ప్రతి పాఠశాల ప్రతి సబ్జెక్టు 100శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో తరగతి గదిలో మమేకమై ఎస్ఎస్‌సి పరీక్షలకు ప్రిపరేషన్‌పై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముబీన, రెహనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22న సెయింట్ జోసెఫ్ హైస్కూల్ 43వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కడప అర్బన్

సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 43వ వార్షికోత్సవం ఈనెల 22న సాయంత్రం 4:30 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ సంబుటూరి సురేష్, సిస్టర్ లిమరోస్, సిస్టర్ ఫ్రాన్సినా శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా కడప డియోసెస్ బిషప్ డాక్టర్ సగినాల పాల్ ప్రకాష్, ఎమ్మెల్యే మాధవి, డిఇఒ ఎస్.షంషుద్దీన్, డిప్యూటీ డిఇఒ జి.రాజగోపాల్ రెడ్డి, తాలూకా సిఐ టి.రెడ్డప్ప, ఎహెచ్‌టియు ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, తాలూకా ఎస్ఐ టి.నాగప్రసాద్ పాల్గొంటున్నట్లు తెలిపారు. వార్షికోత్సవంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.



నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అష్ఫాకుల్లాఖాన్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

ప్రజాశక్తి - బద్వేలు

స్వతంత్ర సమరయోధులు అష్ఫాకుల్లాఖాన్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఆవాజ్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్వతంత్ర సమరయోధులు రాంప్రసాద్ బిస్మిల్ - అష్ఫాఖ్ కుల్లా ఖాన్ 98వ వర్ధంతికి ఆవాజ్ కమిటీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ముఖ్య అతిథులుగా వచ్చేసిన ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి,చాంద్ బాషా, ఆర్యవైశ్య వర్తక సంఘం బద్వేల్ పట్టణ అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, మహానీయుల ఆశయ సాధన వ్యవస్థాపకులు బద్వేల్ గురుమూర్తి, బద్దల కళా పీఠం అధ్యక్షులు సాంబశివ రెడ్డి, మాట్లాడుతూ భారతదేశం బ్రిటిష్ పాలకుల కబంధహస్తాల నుంచి మాతృభూమిని విముక్తి చేయాలని తపన ఇరువురికి ఏర్పడిందన్నారు. ఇరువురు చదువును మధ్యలోనే స్వస్తి పలికి బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కలిగించాలని హిందుస్థాన్ పబ్లికేషన్ అనే సంస్థలో చేరి జాతీయోద్యమ చరిత్రలో ఉత్తేజ పూరితమయ్యారని చెప్పారు. వారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బద్వేల్ పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్. అబ్దుల్ సత్తార్, ఎస్ అన్వర్ బాష , సిఐటియు జిల్లా కార్యదర్శి కె, శ్రీనివాసులు , ఎన్. నాగేంద్రబాబు, ఎం. కొండయ్య , వృత్తిదారుల సంఘం బద్వేల్ పట్టణ కార్యదర్శి జి. నాగార్జున పాల్గొన్నారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిఎస్‌పి మురళీ నాయక్


ఆడపిల్లల భద్రతపై తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆడ పిల్లల భద్రతపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ పేర్కొన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం వేంపల్లెలోని క్రిష్టియన్ కాలనీలోని ఆయా ప్రాంతాల్లో ప్రజలకు మహిళాలు భద్రత, పోక్సో చట్టం, బాలబాలికలు ఎదుర్కొనే మానసిక, శారీరక వేధింపులు, మట్కా, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చోటు చేసుకునే ఆడ పిల్లల నడవడికలను, అలవాట్లను తల్లిదండ్రులు గమనిస్తూ వారిపై దృష్టి పెట్టాలని కోరారు. చిన్న వయస్సులో బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. పిల్లలను బాగా చదివి ప్రయోజనాలను చేయాలని కోరారు. మత్తు పదార్థాలు, గంజాయి వాటికి దూరం ఉండాలని చెప్పారు. మట్కా ఆడడం వల్ల జీవితాలు కూడా నాశనం అవుతాయని, కాబట్టి వాటికి దూరంగా ఉండాలని కోరారు. మహిళలకు ఎల్లవేళలా రక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా పోలీసు విభాగాలను ఏర్పాటు చేసిందని, వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ార్యక్రమంలో సిఐ నర్సింహులు, ఎస్ఐ తిరుపాల్ నాయక్, రంగారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సబ్‌డివిజన్ అధికారి సిద్దయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నరంగాపురంలో నీరు నిలిచిన చోట దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ఆయిల్ బాల్స్ వదిలారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ దోమల లార్వా నిర్మూలనలో ఆయిల్ బాల్స్ ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తాయని చెప్పారు. నీటి మీద ఆయిల్ పొర ఏర్పడం వల్ల లార్వా శ్వాస తీసుకోలేక మరణిస్తాయన్నారు. సాధారణ ఆయిల్ కంటే ఆయిల్ బాల్స్ ప్రభావం ఎక్కువ కాలం ఉంటుందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలి అంటే నీరు నిల్వ ఉండకుండా చేయడం, వారానికి ఒకసారి డ్రై-డ్రై పాటించడం, పాత టైర్లు, డబ్బాలు, కొబ్బరి చిప్పలు తొలగించడం, నీటి ట్యాంకులు, డ్రమ్ములను మూతలతో కప్పి ఉంచడం, మురుగు నీటి సరైన ప్రవాహం, నిర్మాణ ప్రదేశాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మహేశ్వర్ పోలీస్ కవిత పాల్గొన్నారు.



ఆయిల్ బాల్స్ వేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు



5జి ఫోన్లను అందజేస్తున్న అతిథులు

అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి, డిజిటలైజేషన్‌కు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, ఏపి ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ అన్నారెడ్డి ప్రసాద్ అన్నారు. శుక్రవారం వారు అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వం మంజూరు చేసిన శామ్‌సంగ్ గెలాక్సీ 5జి ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో పనితీరు మెరుగుపడుతుందని చెప్పారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పౌష్టికాహార వివరాలు, ఆరోగ్య సూచికలను ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు ఈ 5జి ఫోన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంలో, అమలు చేయడంలో అంగన్వాడీల పాత్ర కీలకమని చెప్పారు. వారికి ఈ స్మార్ట్ ఫోన్లు మరింత శక్తినిస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, ఆర్‌డిఓ చిన్నయ్య, అధికారులు పాల్గొన్నారు. **వేంపల్లె:** స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వేముల, చక్రాయపేట, వేంపల్లె మండలాల్లోని ఆయా అంగన్వాడీలకు 144 సెల్ ఫోన్లు పంపిణీ చేసినట్లు ఐసిడిఎస్ సిడిపిఒ సునీత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన కొత్త సెల్ ఫోన్ లను ఆయా మండలాల్లో పని చేస్తున్న అంగన్వాడీలకు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు సరఫరా చేసిన సెల్ ఫోన్లలో పిల్లలు పెరుగుదల, పర్యవేక్షణ, పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు లాంటివి ఆన్‌లైన్‌లో వేగవంతంగా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సెల్ ఫోన్లు ఇచ్చినట్లు చెప్పారు. అలాగే సూపర్‌వైజర్లకు, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్లకు కూడా కొత్త సెల్ ఫోన్లు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు డాక్టర్ స్వర్ణలత, సుభద్ర, అంగన్వాడీలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య

నిండు జీవితానికి రెండు చుక్కలు

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పక వేయించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య అన్నారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని శాస్త్రి నగర్‌లో శుక్రవారం పల్స్ పోలియో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి తల్లి అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ రెండు పోలియో చుక్కలు వేయించి వారి బంగారు భవిష్యత్తును కాపాడాలన్నారు. పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, సభ్యులు గంగాభవాని, రమణమ్మ, డిహెచ్ఇఒ శోభారాణి, ఆరోగ్య కార్యదర్శి ఉదయలక్ష్మి, అంగన్వాడీలు ఆశాలు పాల్గొన్నారు.



హాఫీజును సన్మానిస్తున్న సిఐ, పోలీసులు

కానిస్టేబుల్ హాఫీజునుకు సన్మానం

ప్రజాశక్తి - ముద్దనూరు

కూటమి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాల్లో ముద్దనూరు టౌన్‌కు చెందిన వివాహిత మహిళ హాఫీజును ప్రతిభ కనబరిచి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రం అందుకున్నారు. మహిళా కానిస్టేబుల గా ఎంపికై శిక్షణకు వెళ్తున్న హాఫీజును శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో సిఐ నాగేష్ బాబు, ఎస్ఐ మైనుద్దీన్ సత్కరించి సన్మానించారు. వివాహమైన నిరాశ చెందకుండా దృఢ సంకల్పంతో కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించిన ఆమె ప్రతిభను సిఐ కొనియాడారు. కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎఇఇ జగదీశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పట్టణం పరిధిలోని ప్రభుత్వాస్పత్రి, కోతి సమాధి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం. 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని ముసలరెడ్డి పల్లెలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి టిడిపి వేంపల్లి మండల పరిశీలకుడు అజ్జుగుట్ట రఘునాథరెడ్డి భూమి పూజ చేశారు. శుక్రవారం గ్రామంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో కలిసి పనులు ప్రారంభించారు. దాదాపు రూ. 34 లక్షల వ్యయంతో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రఘునాథరెడ్డి

రుణాల చెల్లింపునకు గడువు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

తిప్పలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులుగా ఉన్న రైతులు గతంలో భూములపై రుణాలు తీసుకోవడం తీసుకున్నారు. ఆ రుణాలు చెల్లించేందుకు గడువు ఇవ్వాలని సంబంధిత కోర్టులో జడ్జిని కోరినట్లు రైతులు తెలిపారు. శుక్రవారం పట్టణంలో తిప్పలూరు ప్రాథమిక వ్యవసాయ కార్యాలయంలో వారికి అందిన నోటీసు మేరకు జడ్జి ఎదుట రైతులు హాజరయ్యారు. అనంతరం రైతులు, వైసిపి స్టేట్ జాయింట్ సెక్రటరీ మాడిశెట్టి శివకుమార్ కార్యాలయంలో మాట్లాడారు. రైతులు పి వెంకటాపురానికి చెందిన కె పుల్లారెడ్డి, మాలేపాడు సుబ్బరాయుడు, గుర్రప్ప మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా పంటలు సరిగా పండడం లేదని, అందువల్ల రుణాలు, రుణాలకు వడ్డీలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని వాపోయారు. మార్చిలో పంట మాసులు చేతికి వస్తాయని అనంతరం రుణాలు చెల్లిస్తామని చెప్పి జడ్జికి వివరించామని తెలిపారు. తమపై దయవుంచి గడువు ఇవ్వాలని కోరామని చెప్పారు. జనవరి నెలలో రుణాలు చెల్లించకుంటే భూములు వేలం వేస్తామని అధికారులు హెచ్చరించారని వారు వాపోయారు. అదే జరిగితే తమకు ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాడిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ బ్యాంకులు (పిఎసిఎస్) గడిచిన ఐదున్నరేళ్ల కాలంలో పారిశ్రామికవేత్తలకు రూ.6.15 లక్షల కోట్ల విలువైన రుణాలను మాఫీ చేశాయని తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వాలు చిన్నచూపుగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు వేస్తున్న అంటూనే వారికి ఎలాంటి రుణ మాఫీలు ఇవ్వడం లేదని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన విధంగా రైతులకు రుణమాఫీలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా పంటలు సరిగా పండని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారికి రుణాలు చెల్లించేందుకు మరో ఏడాది గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రుణాలనుమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

పేదలకు చట్టపరంగా భూమిని అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

ప్రజాశక్తి - చాపాడు

నిరుపేదలకు చట్టపరంగా భూమిని అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. కడప ఆర్ అండ్‌బి గెస్ట్ హౌస్ మీటింగ్‌హాల్‌లో శుక్రవారం రెవిన్యూ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సచివాలయంలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఇప్పటి వరకు పూర్తి చేసిన భూ సర్వే వివరాలు గురించి చర్చించనున్నామని తెలిపారు. బ్రహ్మంగారిమఠం మండలంలో చేపట్టిన బోగస్ ఆన్‌లైన్ భూముల గుర్తింపు ప్రక్రియ పురోగతిపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా, అర్హులకు అన్యాయం చోటు చేసుకోకుండా నిష్పక్షపాతంగా ప్రక్రియ ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాని పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమం వల్ల భూమి లేని నిరుపేదలకు, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ భూమిని చట్టపరంగా పంచటమే తన లక్ష్యమని తెలిపారు. బద్వేల్ రెవిన్యూ డివిజన్ ఆఫీసర్ చంద్ర మోహన్ వివరిస్తూ ఇప్పటికే చాలా గ్రామాలలో ఫీల్డ్ వర్క్ మొదలుపెట్టి, పూర్తి చేశామన్నారు. చాలా రెవెన్యూ గ్రామాలలో ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకుని దొంగ పత్రాలు సృష్టించి సాగులో ఉన్నాయని, అలాంటి వాటిని గుర్తించామని చెప్పారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ శిరీషా, బి.మఠం తహశీల్దార్ కార్తీక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం



కోర్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ నాగేంద్ర

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సర్టిఫికెట్ కోర్సును కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర ప్రారంభించారు. శుక్రవారం ఆన్ లైన్ ద్వారా కళాశాలలో నూతనంగా ప్రవేశ పెట్టిన సర్టిఫికెట్ కోర్సు ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర మాట్లాడుతూ సమాజంలో రోజు రోజుకూ పెరుగుతున్న మహిళల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ కోర్సు ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. ప్రధాన మంత్రి ఉచ్చత శిక్ష అభియాన్ పథకం కింద ప్రభుత్వ కళాశాలలో ఈనెల 22 నుంచి 2026 జనవరి 8 వరకు 15 రోజుల పాటు సర్టిఫికెట్ కోర్సు కింద పాఠాలు చెబుతారని పేర్కొన్నారు. కళాశాలలోని మహిళా విద్యార్థుల కోసం ఈ పథకానికి సంబంధించి ఓరియెంటేషన్ ప్రోగ్రాంను చేపట్టినట్లు చెప్పారు. ఎక్కువ ఖర్చుతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ప్రతి బాలిక ఈ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు కార్యక్రమంలో ఎక్సెల్ ఆర్ ఎడ్ టెక్నాలజీ ప్రయివేటు లిమిటెడ్ రీజినల్ మేనేజర్ సుభాష్ చంద్రబోస్, పిఎం ఉషా, కో-ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, అధ్యాపకులు అరవింద్, డాక్టర్ బాలకొండ గంగాధర్, షఫీవుద్దీన్, కిరణ్మయి, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ : వైఎస్ఆర్ కడప జిల్లా గ్రంథాలయ చైర్మన్ దాసరి భాను ప్రకాష్‌ను జిల్లా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు రామచంద్రనాయక్, బాలరాజు ఆధ్వర్యంలో ఉద్యోగులు శుక్రవారం శ్రీ విద్యాధరి పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఉన్నత స్థాయి అధికారులు దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరలో పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జమ్మలమడుగు, కలసపాడు లింగాల, ఎర్రగుంట్ల, ముద్దనూరు, మండలాల నుంచి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిఎంకు అవార్డు పట్ల హర్షం

ప్రజాశక్తి - జమ్మలమడుగు : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ది ఎకనమిక్ టైమ్స్ దినపత్రిక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్'గా అవార్డు ప్రకటించడం పట్ల రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మార్కెట్ యార్డ్‌చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ సుదీర్ఘ అనుభవశాలి, దార్శనికుడు రాష్ట్ర బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతి నిధి నవీన్, నాగరాజు,శంకర్, దస్తగిరి,ఫిలిప్, చెన్నయ్య, పాల్గొన్నారు.

రుచికర, నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : విద్యార్థులకు ప్రభుత్వం అందించే మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లోపించకూడదని ఎంఇఒ నాగేశ్వర నాయక్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాగేశ్వర నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలకు చెందిన ప్రధాన వంట మాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరంగా నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఎండిఎం వంట ఏజెన్సీ వారు మధ్యాహ్నం భోజన విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంట గది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 అన్నయ్య, సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

పాత టైర్లను తొలగించాలి

ప్రజాశక్తి -గోపవరం

ఇళ్ల పరిసరాల్లో ఉన్న పాత టైర్లను తొలగించాలని బద్వేల్ మున్సిపల్ కమిషనర్ వి.వి. నరసింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పురపాలక పరిధి మడకలవారిపల్లెలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండే పాత డ్రమ్ములు, పాత టైర్లు వంటి వాటిని వెంటనే తొలగించాలని ప్రజలకు సూచించారు. పాత టైర్లలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల లార్వా పెరిగి, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులకు కారణమైన టైగర్ దోమలు ఉత్పత్తి అవుతాయని తెలిపారు. వీటి వల్ల జ్వరాలు వ్యాప్తి చెంది ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. బద్వేల్ పట్టణంలో ఎక్కడ ఉన్న పాత టైర్లనైనా గుర్తించి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, హెల్త్ సెక్రటరీలు, మున్సిపల్, సచివాలయ, వార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్

చేనేత కార్మిక సంఘం
జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభలు ఈ నెల 22న సోమవారం జమ్మలమడుగు పట్టణంలో నిర్వహించనున్నామని, ప్రతి చేనేత కార్మిక సోదరులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మిక సంఘం మహాసభలకు మొట్టమొదటిసారిగా జమ్మలమడుగు వేదిక కానుందని అన్నారు. భారతదేశంలో వ్యవసాయం తర్వాత రెండవ ప్రాధాన్యత కలిగిన రంగం చేనేత రంగం అన్నారు. మానవ సమాజానికి నాగరికత నేర్పిన చేనేత కార్మికులు నేడు పాలకులు అవలంభిస్తున్న కార్పొరేట్ విధానాల వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలో పడి ఆకలి చావులు ఆత్మహత్యలకు బలవుతున్నారు అన్నారు. నమ్ముకున్న వృత్తిని వదులుకోలేక మరో వృత్తిలోకి వెళ్లలేక జీవచ్ఛంఅ బతుకుతున్నారని చెప్పారు. ప్రస్తుతం పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు చేనేత కార్మికులకు కష్టాలు కన్నీళ్లే మిగులుస్తున్నాయన్నారు. చేనేత రంగంలో అంతర్జాతీయ ఖ్యాతిని సమపర్జించిన చేనేత కళాకారులు ప్రస్తుతం ఆకలి మంటలతో అలమటిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రెండు లక్షల మగ్గాలపై మరో రెండు లక్షల మంది ఉపవృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని ఇలాంటి చేనేత రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వకుండా పవర్ లూమ్‌లను ప్రోత్సహిస్తున్నారని చెపాపరు. కేంద్ర రాష్ట్ర పాలకులు పవర్ లూమ్ యజమానులకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ చేనేతను ధ్వంసం చేస్తున్నారన్నారు. బోగస్ సొసైటీలు చాలా ఉన్నాయని, లక్షల రూపాయల అవినీతి నిలయాలుగా మారాయని , వాటిని ప్రక్షాళ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. తనిఖీలు నిర్వహించి బోగస్ సొసైటీలను రద్దు చేయాలని అన్నారు. చేనేతలకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టం అమలు ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేసి చేనేతలను ఆదుకోవాలని చెప్పారు. దేశవ్యాప్తంగా చేనేతకు సమగ్రమైన విధానాన్ని ప్రకటిం చాలని కోరారు. ముఖ్యంగా రాష్ట్రంలో చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు లేకపోవడం చేత ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. చేనేత కార్మికులకు మూడు సెంట్లు స్థలంలో మగ్గం షెడ్లు కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. సొంత స్థలం ఉన్న వారికి ఇల్లు నిర్మాణానికి రూ. 6 లక్షలు షరతులు లేకుండా ఇవ్వాలని కోరారు. చేనేత కార్మి కులకు ఎటువంటి షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చి వారి అభివృద్ధికి తోడ్పాటు అవ్వాలని అన్నారు. గురుకుల పాఠశాలలు ప్రభుత్వ స్కూల్‌ను ఉచితంగా ఇస్తున్న యూనిఫాం బట్టలు చేనేత మగ్గాలపై తయారు చేయించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వీరి డిమాండ్ల సాధనకై జిల్లాలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం మహాసభలు వేదికగా చర్చిస్తారని పేర్కొన్నారు. మహాసభలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కంభం.సంజీవ్, నారాయణ ,వద్ది.నరసింహులు వేణుగోపాల్, మస్తాన్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు



గెలుపొందిన ఆనందంలో తోటి క్రీడాకారులతో తేజేంద్ర

గోల్ షాట్‌బాల్‌లో తేజేంద్ర ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

నేపాల్ దేశంలోని ఖాట్మండు రాజధానిలోని ఫోకరా ఇండోర్ స్టేడియంలో ఈనెల 16 నుంచి నిర్వహిస్తున్న అంతర్జాతీయ సౌత్ ఏషియన్ గోల్ షాట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని వీరన్నగట్టుపల్లెకు చెందిన రాచవీటి తేజేంద్ర ప్రతిభ చూపారు. తేజేంద్ర వేంపల్లెలోని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. 2009 నుంచి 2025 వరకు కబడ్డీ, హ్యాండ్ బాల్, తైక్వాండో, షూటింగ్ బాల్ క్రీడల్లోనూ రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన గోల్ షాట్ బాల్ ఛాంపియన్ షిప్‌లో ఇండియా జట్టు మొదటి స్థానం రావడంతో బంగారు పతకం అందుకున్నారు. అంతర్జాతీయ ఛాంపియన్ షిప్ కు సంబంధించిన గోల్డ్ షాట్ బాల్ భారత్ జట్టు ఫైనల్‌లో నేపాల్ పై 22 - 11 ఘన విజయం సాధించించారు. ఇందులో నేపాల్ ,ఇండియా, మాల్దీవ్స్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్, థాయిలాండ్ దేశాలు పాల్గొన్నాయి. ఆయా దేశాలతో ఇండియా జట్టు పోటీ పడి మొదటి స్థానానికి చేరుకున్నట్లు తేజేంద్ర తెలిపారు.



చెక్‌ను అందజేస్తున్న మహమ్మద్ షబ్బీర్

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - వేంపల్లె : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల కుటుంబాలకు వరం లాంటిదని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల టిడిపి పార్టీ కార్యాలయంలో వేంపల్లెకు చెందిన ఆఫ్రిజా అనే మహిళకు అనారోగ్యం కావడంతో కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్సలు చేయించారు. శుక్రవారం ఆఫ్రిజాకు కుటుంబ సభ్యులు కొమ్మది షరీఫ్‌కు రాష్ట్ర ప్రభుత్వం సిఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ 5.70 లక్షల చెక్కును షబ్బీర్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం కోసం ఖర్చు పెట్టుకున్న పేదలకు సిఎం సహాయ నిధి కింద ఆర్థికంగా ఆదుకుంటుందని చెప్పారు. వైసిపి ప్రభుత్వ పాలనలో పేదలకు సిఎం సహాయం అందలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు సిఎం సహాయం కింద ఆర్థికంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదుకోవడం జరుగు తుం దని చెప్పారు. పేదలకు ఆదుకోవడానికి సిఎం సహాయ నిధి మం జూరు కావ డానికి పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి, వేంపల్లె మం డల పరిశీల కుడు రఘునాథ్ రెడ్డి చాలా తోడ్పాటు ఇస్తున్నట్లు చెప్పారు. పేదలు తరుపున ఆయన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చెక్కులు పంపిణీ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ అమర్నాథ్, బాబా, షరీఫ్, రాము పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముద్దనూరు : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిఐ నాగేష్ బాబు సూచించారు. ఉప్పలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ విద్యార్థులకు చట్టాలు,హెల్ప్ లైన్ నెంబర్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న చట్టాలపై తెలుసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, మహిళల భద్రత,హెల్ప్ లైన్ నెంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా కానిస్టేబుల్ యశోద, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - చాపాడు : మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ వీర కిషోర్ తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీల సొంత వనరుల ఆదాయాన్ని మెరుగుపరచడానికి వ్యూహాలు, సాంకేతికతలను అభివృద్ధి చేయడంపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విఆర్‌ఒలు హాజరు కావాలని పేర్కొన్నారు.

నేడు డాక్యుమెంటరీ ప్రదర్శన

ప్రజాశక్తి - జమ్మలమడుగు: నవాబుపేట గ్రామ దేవర పెద్దమ్మ-చిన్నమ్మల కథనంగా రూపొందిన డాక్యుమెంటరీ హైదరాబాద్‌లోని ఎల్.వి.ప్రసాద్ లేబరేటరీలో శనివారం ప్రదర్శిస్తారని కియేటివ్ హెడ్ వెన్నపూస శివ ప్రసాద్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నవాబ్‌పేట గ్రామ సంప్రదాయాలు, విశ్వాసాలను ఆవిష్కరించే డాక్యుమెంటరీకి మురళీ కృష్ణతుమ్మ దర్శకత్వం వహించారని, తాను క్రియేటివ్ హెడ్‌గా వ్యవహరించానని తెలిపారు. గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే ప్రయత్నం ప్రేక్షకులను ఆకట్టుకోనుందన్నారు. డాక్యుమెంటరీ త్వరలోనే విడుదల చేస్తామని పేర్కొన్నారు.

ధనలక్ష్మి దేవిగా వాసవి మాత దర్శనం

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక కన్య కాపరమేశ్వరి ఆలయంలో ధనలక్ష్మి దేవిగా కన్యకాపరమేశ్వరి అమ్మ వారి దర్శనం ఇచ్చారు. శుక్రవారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థా నంలో ధనుర్మాసం పూజలు అత్యంత వైభవంగా నిర్వహి ంచారు. ధనుర్మాసం మొదటి శుక్రవారం పురస్క రించుకుని ఆలయ అర్చ కులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేత ృత్వంలో శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవికి విశేష పూజలు చేశారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి-రాజంపేట: మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని, మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని రాజంపేట సహాయ మత్స్య పర్యవేక్షకులు మురళీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు 45.50 లక్షల చేప పిల్లలను నీటిలో వదలామన్నారు. ఈనెల 11వ తేదీన బహుధా మత్స్య క్షేత్రం నుండి 9.50 లక్షల చేప పిల్లలను, పీలేరు మత్స్య క్షేత్రం నుండి 1.50 లక్షల చేప పిల్ల లను వదలామని తెలిపారు. 12వ తేదీన తిరుపతి జిల్లాలోని కళ్యాణి డాం మత్స్య క్షేత్రం నుండి 11.50 లక్షల చేప పిల్లలను, 16వ తేదీన తిరుపతి మత్స్య క్షేత్రం నుండి 5.70 లక్షల చేప పిల్లలను వదలామన్నారు. 17వ తేదీన చిత్తూరు జిల్లాలోని కృష్ణాపురం మత్స్య క్షేత్రం నుండి 8.20 లక్షల చేప పిల్లలను, 18వ తేదీన పలమనేరు మత్స్య క్షేత్రం నుండి 9.10 లక్షల చేప పిల్లలను వదలామన్నారు. నందలూరు మండలం కోనాపురం గ్రామ పంచాయతీలో ఉన్న సోమశిల వెనుక జలాలలో సీడ్ స్టాకింగ్ కమిటీ సభ్యులు, గ్రామ మత్స్య కారులు పాల్గొని చేప పిల్లలను వదలామని పేర్కొన్నారు.

రాజశ్రీ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు

O.S.No. 346/2022

కలికిరి రవిశంకర్, తండ్రి నారాయణ, వయస్సు 45 సం॥, డోర్‌నెం.39/464-5, అరవిందనగర్, కడప. ...వాది

Vs

దియాల రాజు, S/o వెంకటసుబ్బయ్య, వయస్సు 50 సం॥లు, హిందూ, డోర్‌నెం.16-1099, మునిసిపల్ క్వార్టర్స్, మాసాపేట, కడప. ...ప్రతివాది

నోటీసు

పై వ్యాజ్యములోని వాది తన బాండు బాపతు బాకీ నిమిత్తం పై దావా దాఖలు చేసినందున పై కోర్టు వారు నీ యొక్క హాజరు నిమిత్తం పై దావాను 23.12.2025 తేదికి వాయిదా వేసి యున్నారు. కనుక నీవు పై తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు యెదుట హాజరై ఏవైనా ఆక్షేపణలున్న యెడల తెలుపుకోవలసినది. అట్లు కాని యెడల నీ పరోక్షమున కేసును తీర్మాణించబడును.

//కోర్టు ఉత్తర్వు మేరకు//

G. NAGESWARA RAO

వాది తరపు న్యాయవాది, కడప.